
# కోరిక

ఇడ్లీల సుబ్బయ్యమ్మ కేకలు అటు రత్తమ్మ కిరాణాకొట్టు దగ్గర్నుంచి ఇటు బియ్యం భాగ్యంగారి ఇంటిదాకా వినిపిస్తున్నాయి. రాత్రి వాళ్ళింట్లో కాలూడిపోయిన కుర్చీ కుర్రోళ్ళెవరో పట్టికెళ్ళిపోయేరట. దాంతో పెద్ద



నోరేసుకుని వీధిలో ఉన్నోళ్ళందర్నీ రేవెట్టేస్తుంది. అవి మామూలు తిట్లుగాదు అసలు అలాంటి తిట్లు ఎవరినోటమ్మటా వినం... తీసినోడికి సిగ్గూశరం ఉంటే ఆ ఇడ్లీల బల్ల తెచ్చి ఆ మనిషి కిచ్చెయ్యాలి.

ఇంట్లోంచి బయటికొచ్చిన మల్లిడి వెంపారెడ్డి ఆ తిట్లన్నీ వింటా కాల్వకాడున్న కర్రి అప్పారావు గారింటికెళ్తున్నాడు.

ఏనాడూ అతను వూళ్ళో వాళ్ళని ఒక్కమాట అన్న మనిషికాదు ఏనాడూ ఊళ్ళో వాళ్ళతో ఒకమాట పడ్లేదు వెంపారెడ్డిగారు. అంత నెమ్మదస్థుడు. అంత బుద్ధిమంతుడు.

అతనికి అయిదుగురు కూతుళ్ళు. ముగ్గురుకొడుకులు. అల్లుళ్ళు, కొడుకులూ, వాళ్ళ భార్యలుగానీ, ఎవ్వరూ అతన్ని ఏనాడూ



ఒక్కముక్క తక్కువ చేసి మాట్లాడింది లేదు.

ఈ వెంపారెడ్డిగారికి అప్పుడప్పుడూ అనిపిస్తుంది. వీళ్ళెవరన్నా కాస్సేపు నన్ను తిడితే బాగుండ్ను అని. వాళ్ళతో తిట్టించుకోవాలి అని. ముఖ్యంగా అతనికి అయిదోకూతురు చిన్నమ్మ అన్నా, రెండోకొడుకు అబ్బు అన్నా చాలా ఇష్టం. వాళ్ళిద్దరూ తనను తిడితే బాగుండుననుకున్నాడు.

* * *

సంక్రాంతి రోజులొచ్చాయి. పండక్కి ఊళ్ళనించి అయిదుగురు కూతుళ్ళు అల్లుళ్ళూ వచ్చేరు.

వెంపారెడ్డిగారి భార్య సూరమ్మగారు పిండివంటల్లోకి దిగింది.

రామచంద్రపురం కొండపల్లి సూరన్నగారి బట్టలకొట్లో అందరికీ ఖరీదైన బట్టలు తీసిన వెంపారెడ్డిగారు చిన్నమ్మకీ అబ్బుకీ కొనలేదు బట్టలు. మొత్తం బట్టలన్నీ సైకిలు వెనక కేరేజీకి కట్టుకుని ఇంటికి తెచ్చి టైలరు బూర్రావుకి కబురెట్టి ఎవరి బట్టలు వాళ్ళకిచ్చి చిన్నమ్మనీ, అబ్బునీ పిల్చి మీకు తీయలేదన్నాడు.

''సరే'' అనేసి వెళ్ళిపోయారు.

రాత్రయింది. వీధంతా నిశ్శబ్దంగా ఉంది.

బయటికెళ్ళి అప్పుడే వచ్చిన వెంపారెడ్డి కాళ్ళు కడుక్కుని భోజనం చేసేక ''బట్టలు తియ్యనందుకు చిన్నమ్మ ఏవన్నా ఇదయ్యిందా?'' అని అడిగేడు భార్య సూరమ్మని.

''ఏమో నా దగ్గరేం అన్లేదు'' అంది సూరమ్మ.

చిన్నమ్మా వాళ్ళాయనా మాటాడుకుంటుంటే రహస్యంగా వాళ్ళ గది వెనక్కెళ్ళి వింటున్నాడు.

''అదేంటి అందరికీ తీసి నీకూ మీ రెండో అన్నయ్యకీ మట్టుకి బట్టలు తియ్యలేదు మీ నాన్నగారు?'' అడిగేడు చిన్నమ్మభర్త.

''ఏమో'' అని నవ్వింది చిన్నమ్మ.

''ఆ నవ్వేంటి వెళ్ళి అడగనా ఆయన్ని?'' అన్నాడు.

''వద్దు'' అంది చిన్నమ్మ.

''ఎందుకొద్దు పోనీ నువ్వెళ్ళి అడుగు'' అన్నాడు.

''నేనెళ్ళి అడగను''.

''ఎందుకు?''.

''మా ఇంట్లో అందరికంటే నేనంటేనే ప్రేమ నాన్నగారికి. బహుశా ఇంతమందికి బట్టలు తీస్తుండగా నా దగ్గరకొచ్చేసరికి డబ్బు అయిపోయి ఉంటుంది. అందుకే తియ్యలేదు'' అంది.

''ఆ మాట నీకాయన చెప్పాలి గదా?'' అన్నాడు చిన్నమ్మ వాళ్ళాయన.

''నాకు చెప్పక్కర్లేదు నేనాయన్ని అర్థం చేసుకోగలను'' అంటూ తండ్రి ఎంత ఉత్తముడో ఎంత మెత్తనివాడో గతంలో జరిగినవి చాలా చెప్పేసరికి అదోలా అయిపోయిన ఆమె మొగుడు అయ్యయ్యో మావగారు అంత గొప్పవారా ఆయన్ని అనవసరంగా అపార్థం చేసుకున్నానే అని బాధపడ్డం మొదలెట్టాడు. తలుపు వెనకనించి అంతా విన్న వెంపారెడ్డిగారు తలబాదుకుంటా ''కనీసం ఈ అయిదో అల్లుడయినా నన్ను అపార్థం చేసుకుని తిట్టి ఉంటే బాగుండ్ను గదా!'' అనుకుని రెండోకొడుకు అబ్బు గదిలోకెళ్ళేడు.

తండ్రినిచూసి మంచం మీంచి లేచేడు అబ్బు.

''ఇంకా నిద్రపోలేదేంట్రా?'' అడిగేడు వెంపారెడ్డిగారు.

''లేదు నాన్నగారూ'' అన్నాడు అబ్బు.

''పండక్కి నీకు బట్టలు తియ్యనందుకు బాధపళ్ళేదా... నన్ను తిట్టుకోలేదా?'' అడిగేడు వెంపారెడ్డిగారు.

''లేదు నాన్నగారూ!'' అన్నాడా రెండోకొడుకు.

''ఎందుకు తిట్టుకోలేదు?''

''తియ్యకపోవడానికి ఏదో కారణం ఉంటుంది గదా ఏ కారణం లేకుండా మీరేపనీ చెయ్యరు కదా... అందుకే మీగురించేం అనుకోలేదు'' అన్నాడు.

''ఏకారణం లేదు...నా దగ్గర డబ్బులున్నాయి అయినా తియ్యలేదు నీకు'' అన్నాడు వెంపారెడ్డి.

నవ్వేసిన అబ్బు ''మీరేం చేసినా దాని వెనకాల ఏదో ఒక కారణం ఉంటది. ఉట్టి పుణ్యాన మీరేం చెయ్యరు'' అన్నాడు.

చాలా విసుక్కున్నాడు వెంపారెడ్డిగారు. ''అయితే వీళ్ళెవరికీ నా మీద కోపం రాదా..జీవితాంతం నన్ను మెచ్చుకోవడమేనా నన్ను పొగడ్డమేనా'' అనుకుంటా బయటికొచ్చేసేడు.

* * *

''తన నెవరన్నా తిడితే బాగుండును'' అన్నకోరిక రోజురోజుకీ పెరిగిపోతుంది వెంపారెడ్డిగార్లో.

ఇంట్లో వాళ్ళెలాగా తనని తిట్టడం లేదు. కనీసం వీధిలో వాళ్ళతో అన్నా నాలుగు తిట్లు పడదామని ఆ మిట్ట మధ్యాన్నం పూట ఒక మూరెడు పొడుగున్న కర్ర తీసుకుని వీధి అరుగు మీద కూర్చుని ఎవరొస్తార్రా దాన్ని ఎవరి కాళ్ళ మధ్యకి విసురుదామా అని చూస్తున్నాడు.

కోరిశేషయ్యగారి కోడళ్ళు బొంబాయి దగ్గర గిన్నెలు తోముకుంటున్నారు. గళ్ళపెట్టి ముందుకు కూర్చున్న చినెంకట్రాజు బేరాల్లేక రేగుపళ్ళ వడియాలు చప్పరిస్తున్నాడు. కోటయ్య చిన్నకొడుకు బాలు వాళ్ళ అరుగుమీద కూర్చుని డోలు వాయించడం నేర్చుకుంటున్నాడు. ఉత్తరాలు కట్ట పట్టుకు నడుచుకుంటా వస్తున్నాడు పోస్టుమేన్ సూర్నాణ.

అంతే, చేతిలో ఉన్న మూరెడు కర్రనీ గిరగిరా తిప్పి విసిరేసరికి సూర్నాణ కాళ్ళ మధ్య ఆ కర్ర పడ్డం అతను బోర్లాపడ్డం ఒక్కసారిగా జరిగిపోయినియ్యి. దబ్బుమని అతను బోర్లాపడ్డ చప్పుడుకి కుళ్ళి కాల్వ పక్కన మేస్తున్న పిల్లలకోడి బక్కుబక్కుమని అరుస్తా చెల్లా చెదురయిపోయింది.

లేచిన సూర్నాణ డోలు నేర్చుకుంటున్న కుమ్మరోళ్ళ బాలూ డిప్పమీద ఒకటికొట్టి ''చిన్నంత్రం పెద్దంత్రం లేకుండా ఏంట్రా ఇది'' అని ఒకటే తిట్లు.

మధ్యలోకొచ్చిన వెంపారెడ్డిగారు ''అదిగాదు సూర్నాణ విసిరింది ఆ కుర్రోడుగాదు అసలు జరిగిందేంటంటే..'' అంటున్న ఆయన్ని పక్కకి తోసేసిన సూర్నాణ ఆ బాలూగాడ్ని కొట్టినంత పని జేస్తుంటే కోటయ్య పెద్దకొడుకు వీర్రాజు వచ్చి విడదీసేడు.

నీరసంగా ఇంట్లో కెళ్ళిపోయిన వెంపారెడ్డిగారు మర్నాడు ఆఫీసులో కూర్చుని రాసుకుంటున్న వాడల్లా సంతలో ఆశీలు వసూలు చెయ్యడానికెళ్తున్న బిల్లు కలెక్టరు దాసుని ఓసారిలా రమ్మని పిల్చేడు. ''ఏంటి రెడ్డిగారూ?'' అని దగ్గరకొచ్చిన దాసుని లాగి పెట్టి కొట్టేసేడు.

అవాక్కయి చూస్తుండిపోయిన దాసు కాస్సేపు తర్వాత కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంటా ''అయితే ఆవిషయం మీక్కూడా తెల్సిపోయిందన్నమాట'' అన్నాడు.

''ఏ విషయం?'' అర్థం కాలేదు వెంపారెడ్డికి. ''బత్తినరామ్మూర్తి కోడలితో పెట్టుకున్న తగువు గురించి... నిజమే రెడ్డిగారు మీరు నన్ను కొట్టడం గాదు... కంజారుతో పొడిచినా పాపం లేదు. ఆ మనిషితో గొడవ పడి చాలా తప్పే జేసేను. లేకపోతే సాధు జంతువులాంటి మీకు జన్మలో ఎప్పుడూ లేంది ఇంతకోపం వస్తుందా... నన్ను క్షమించండి రెడ్డిగారూ నన్ను క్షమించండి'' అని వెంపారెడ్డిగారి పాదాలకి నమస్కారం చేసి వెళ్ళిపోయేడు.

ముందు మాట పడిపోయిన రెడ్డిగారు రాత్రెప్పుడో ఇంటికెళ్ళేడు.

తెల్లవారితే భోగిపండగ. తన చిన్నప్పుడు పిల్లలు ఇంట్లోంచి కుర్చీలు, బల్లలూ లాంటివి దొంగతనం చేసి భోగిమంట వేసేసేవారు. తర్వాత చేసుకున్న ఆ ఇళ్ళ వాళ్ళు తెగ తిట్టేవారు.

కనీసం అలా దొంగతనం చేసన్నా తిట్లు పడదామనుకున్నాడు వెంపారెడ్డి.

చాలా పెద్దనోరు ఆ నల్లకాంతమ్మది. ఆ మనిషి నోటి ముందు స్పీకర్లెందుకూ పనికిరావు. డబ్బువడ్డీలకిచ్చి ఇవ్వనివాళ్ళని బూతులు తిడతా ఉంటుంది. ఆ నల్లకాంతమ్మ పక్క ఇల్లు మల్లిడి వెంపారెడ్డిగారిది.

తెల్లారితే భోగిపండగ. నల్లకాంతమ్మ ఇంట్లో దొంగతనం చేస్తే! ఆలోచిస్తున్నాడు.

రాత్రయిపోయింది. ఆలోచన బాగా బలమైంది. ఎట్టి పరిస్థితుల్లో ఈరాత్రి దొంగతనం చెయ్యాలి అనుకున్నాడు. బాగా రాత్రయింది. ఒక నిర్ణయం తీస్కుని నీళ్ళ దొడ్డిగోడ దాటి నిచ్చెన మీద నించి ఎక్కి కింద పక్కనే అవతల పక్కనున్న జామిచెట్టు వుంది. ఆ చెట్టు మీద కెక్కి ఆ కొమ్మలు మీద నించి కిందకి దిగితే నల్లకాంతమ్మగారి దొడ్డి.

అంతసేపు మెలకువగా వున్న తను పదకొండు అయ్యేకా పక్క మీంచి లేచాడు. అర్ధరాత్రి నిచ్చెనగోడకు వేశాడు. నెమ్మదిగా ఎక్కుతున్నాడు. జామిచెట్టు ఎక్కాడు. కిందకు దిగాడు. వయసయిపోవడం వల్ల నరాల్లో పటుత్వం పోయింది. అక్కడున్న చిన్నబల్ల నెత్తిమీద పెట్టుకున్నాడు. మళ్ళీ ఎక్కాడు ఈలోపు కంగారు. ఎక్కడ కాంతమ్మ లేస్తుందో నరసారెడ్డని ఆ కాంతం భర్త ఒకడున్నాడు వాడెక్కడ లేస్తాడో అన్న భయం.

వీధి కుక్క భౌ భౌ మని అరుస్తుంది. తాగేసిన జక్కం వీరన్న పాడుకుంటా వెళ్తున్నాడు. వాడు ఈ వీధిలోకి గాని వస్తాడేమో నల్లకాంతమ్మ గాని లేస్తుందేమోనన్న కంగారు. నెమ్మదిగా కష్టపడి బల్లపైకి తీసి గోడ మీద కెక్కించి ఇతను ఎక్కి జారిపోడం, మళ్ళీ ఎక్కడం అలా కిందికి దిగాడు. దిగి బల్ల తీస్కుని మళ్ళీ ఇంట్లో పిల్లలు ఎక్కడ లేస్తారో అదో కంగారు.

అక్కడ్నించి జాయిగా భోగిమంట దగ్గర పిల్లలు పోగేస్తున్నారు. ఎక్కడెక్కడ్నుంచో ఏవేవో తెచ్చి వాళ్లెవరకీ కనబడకుండా ఆ బల్ల తీసుకొచ్చి అక్కడ పారేశాడు. ఇంటికొచ్చాడు.

అమ్మయ్య అనుకుని ప్రశాంతంగా పడుకున్నాడు. పొద్దున్నే. ''వెధవ చచ్చినోడు గొల్లిగాడు. ఎవడో ఆడు చక్కగా మా ఆయన కూర్చునే బల్లను తీసుకెళ్ళి పోయారు. చచ్చినోడు ఆడ్ని చింతాలమ్మ ఎత్తుకుపోను ఆడు పుంతరేవులో దిగడా...'' ఇష్టమొచ్చినట్టు తిడుతుంది నల్లకాంతమ్మ. ''ఏవరో వెధవలు జ్ఞానం లేకుండాను భయం చెప్పే పెద్దవాళ్ళు లేరా'' అని తిడుతుంది చిన్నమ్మ. చిన్నమ్మే కాదు మల్లిడి వెంపారెడ్డి ఇంటిల్లపాదీ తిడ్తున్నారు.

ఆనందంగా వింటున్న వెంపారెడ్డి ''ఒక రకమైన తన్మయత్వంతో కళ్ళు మూసుకుని ఎన్నాళ్ళకి తీరింది నా కోరిక?'' అనుకున్నాడు.

* * *